ఉన్నావో అది నీకు వ్యక్తమవుతుంది. డబ్బు సంపాదించటానికి ఒక మనిషి ఎన్ని రకాలుగా ప్రయత్నం చేస్తాడో అలాగ నీవు అన్ని విధములుగా ప్రయత్నం చేసి అది భక్తి యోగం అవ్వవచ్చు, కర్మయోగం అవ్వవచ్చు, ఎన్ని విధములుగా సాధన చేసే అవకాశం ఉందో నీవు అన్ని విధములుగా సాధనచేసి భగవంతుని అనుగ్రహం సంపాదించు. భగవంతుడి దయను సంపాదిస్తే అన్నీ సాధ్యమే. భగవంతుడు మనలను అడుగుతున్నాడు ఇది ఎంత స్వీట్‌గా ఉందో చూడండి. మీకు ఇష్టాలు ఉండవచ్చు, అయిష్టాలు ఉండవచ్చు, వాటిని ఒక ప్రక్కన పెట్టండి. నా ఇష్టాన్ని మీ ఇష్టంగా చేసుకోండి చాలు మీరు బాగుపడతారు అని చెపుతున్నాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-09-2007, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు కృష్ణాష్టమి అంటే కృష్ణుడు జన్మించిన రోజు. ఈరోజు జన్మించాడు అంటే శరీరం ధరించిన వాడివలె కనిపించాడు. భగవద్గీతలో వాసుదేవస్వామి ఒకమాట చెప్పారు. మీరు మోక్షం పొందటానికి పెద్దకష్టపడనక్కరలేదు. నాజన్మరహస్యం, నాకర్మరహస్యం నీకు తెలిస్తే మోక్షం వచ్చేస్తుంది అని చెప్పాడు. నీకు అంటే అర్జునుడికనే కాదు ఎవరికి అర్థమైనా వారికి మోక్షం వస్తుంది. ఆయన జన్మరహస్యం అంటే భగవంతుడు అసలు పుట్టడు, పుట్టినవాడి వలె కనిపిస్తాడు. శరీరం పుడుతుంది, పెరుగుతుంది, ముసలిది అవుతుంది, చనిపోతుంది. పుట్టిన దానికి చావు ఉంటుంది కాని పుట్టనిదానికి చావు ఏమిటి? భగవంతుడికి పుట్టుకలేదు, చావులేదు, వికారములేదు. భగవంతుడికి అసలు జన్మంటూ లేదు. జన్మించినవాడివలె, దేహంధరించినవాడివలె కనిపిస్తాడు. శుకమహర్షి పరీక్షిత్తుకు భాగవతం చెపుతాడు. భాగవతం చెప్పటం ముగిసాక పరీక్షిత్తుతో ఇక నేను వెళ్ళివస్తాను, ఒకటి రెండు రోజులలో తక్షకుడు వచ్చి నిన్ను కరిచేస్తాడు, నీ శరీరం చనిపోతుంది. వారం రోజులు నువ్వు చాలా శ్రద్ధగా మహాపురాణం అయిన భాగవతం విన్నావు. భాగవతం శ్రద్ధగా శ్రవణం చేయటం వలన నీకు పశుబుద్ధి పోయింది, ఆత్మబుద్ధి కలిగింది అని చెప్పాడు. ఇప్పుడు మనం అందరం మనుషులమే, పశువులంకాదు. కాని శుకుడు పరీక్షిత్తుకు ఏమని చెప్పాడు అంటే శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను, నేను చనిపోతున్నాను అనుకొనేవాడు ప్రతీవాడు పశువే అని చెప్పాడు. ఆత్మ పుట్టదు, శరీరం పుడుతుంది. ప్రతీవాడు తాను పుట్టనివాడే కాని శరీరం పట్ల నేను అనేబుద్ధి ఉండటం వలన పుట్టాను అనుకొంటాడు. నేను పుట్టాను అనుకొనేవాడు ప్రతీవాడు శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు, అది పశుబుద్ధి. శరీరం ఉండగా

పశుబుద్ధిని పోగొట్లుకొని ఆత్మబుద్ధిని ఎవడైతే సంపాదించాడో, వాడికి శరీరం మరణించేటప్పడు తాను మరణించటం లేదు అని, తాను మరణరహితుడనని అనే అనుభవం కలుగుతుంది, వాడే జ్ఞాని. జ్ఞాని అంటే పుస్తకాలు చదవటం వలన వచ్చే పాండిత్యం కాదు, ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నది ఉన్నట్లుగా ఎవడికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడే జ్ఞాని. శరీరం మరణించినప్పడు తాను మరణించటం లేదు, తాను ఎప్పడూ ఉంటాను అనే సంగతి తెలిస్తే వాడు భయరహితుడు అవుతాడు. నా కర్మరహస్యం తెలుసుకొన్న మీరు బాగుపడతారు అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడికి మనలాగ సొంతపనులు అంటూ లేవు. ధర్మాన్ని స్థాపించటానికి అంటే దుష్టులను శిక్షించటానికి, భక్తులను రక్షించటానికి ఒక శరీరం ధరించివస్తాడు కాని ప్రత్యేకంగా ఆయనకు సొంతపని ఏమీ లేదు. కృష్ణుడు కర్మఫలకాంక్ష లేనివాడు. కృష్ణుడికి హృదయంనిండా ఆనందం, నోటినిండా తీపి, చేతినిండా సత్కర్మ, నిష్కామకర్మ. ఎటువంటి సత్కర్మ అవతారపురుషులు చేస్తారు అంటే అసలు మన సంసారాలే మనం నడపలేక పోతున్నాము, భగవంతుడు చేసేపనికి ఈ ప్రపంచం చిన్నదిగా కనిపిస్తుంది. మనం బలహీనులం, బద్ధకస్తులం, సోమరితనానికి అలవాటుపడి ఉన్నాము కాబట్టి చిన్నచిన్న సంసారాలు మోయటం కూడా కష్టంగా ఉంది, వండుకొని తినటమే భారంగా ఉంది, కూర్చొంటే నిలబడలేకపోతున్నాము. కాని భగవంతుడు పనిచేయటానికి ఈ సృష్టి సరిపోదు, వాడికి టైర్అవ్వటం అంటూ లేదు, వాడు చేసినా చేయనివాడితో సమానం. పనియందు కర్తృత్వబుద్ధి పెట్టుకొన్నివాడిని నేను ఇష్టపడనువయ్యా అర్జునా అని పరమాత్మ చెప్పాడు. ఏదో పనిచేసి నేను అది సాధించాను, ఇది సాధించాను అని ఇలా చెప్పకొనేవారిని చూసి నేను ఇష్టపడను. వారు నాకు భక్తులు కాదు, వారు నాలో ఐక్యం అవ్వరు సరికదా సమీపానికి కూడా రాలేరు అని పరమాత్మ చెప్పాడు.

భగవంతుడి అవతారాలలో రెండు అవతారాలు ముఖ్యం. 1 రామావతారం. 2. కృష్ణావతారం. ఈ రెండు అవతారాలు పరిపూర్ణమైన అవతారాలు. అయితే ఇద్దరికీ తేడా ఏమిటి అంటే రాముడు ప్రతీదీ తాను చేసి చూపించాడు, కృష్ణుడు చేసి చూపించకుండా తాను ఎవరినైతే ఎన్నుకొన్నాడో వారికి చెప్పి, వారికి చేసే శక్తిని ఇచ్చి, వారిచేత చేయించాడు, తనకు ఏమీ తెలియనట్లు, సంబంధం లేనట్లు తామరాకుమీద నీటిబొట్టులాగ అంటకుండా ఉన్నాడు. చంద్రుడు శరీరానికి చల్లదనాన్ని ఇస్తాడు. ఆత్మజ్ఞానం మనస్సుకు చల్లదనాన్ని ఇస్తుంది అంటే మనస్సుకు శాంతిని ఇస్తుంది. ప్రకృతిబుద్ధితో ఆలోచిస్తూ ఉంటే భగవంతుడు మనకు అర్థంకాడు. పరమపవిత్రుడికి ఈశ్వరుడు తన హృదయంలో దర్శనమిస్తాడు. ప్రకృతిబుద్ధితో ఉన్న మనకు భగవంతుడు అందడు కాబట్టి ఆయన లేడు అని మనకు

అనిపిస్తుంది. మన బుద్ధికి అందని విషయాలు అన్నీ అబద్ధాలు అనుకొంటాము, మనం అంత బుద్ధిమంతులం. నువ్వు చావులేని సత్వదార్థమే కాని చనిపోయే శరీరంతో తాదాత్మ్యం పొందుతున్నావు, ఇదే మాయ. మనం ఏదైతే అవునో అది కాదు అనుకొంటున్నాము, ఏదైతే కాదో అది అవును అనుకొంటున్నాము. ఉన్నదానిని లేదు అనుకొంటున్నాము. లేనిదానిని ఉంది అనుకొంటున్నాము. మనకు శ్రేయస్సు కలుగజేసే దానిని శ్రేయస్సు కలుగజేయదు అనుకొంటున్నాము, శ్రేయస్సు దేనివలన కలుగదో అది శ్రేయస్సు కలుగజేస్తుంది అనుకొంటున్నాము, ఇలా ఉంది మన పరిస్థితి.

భగవంతుడు చేసేది కర్తలేని కర్మ. ఆయన ఏ పని చేసినా జీవకోటికి జ్ఞానోదయం కలుగజేయటం కోసమే చేస్తాడు. భగవంతుడు పూర్ణకాముడు, ఆయనకు నెరవేరవలసిన కోరిక అంటూ ఏమీ లేదు. మనకు జన్మలు ఎందుకు వస్తున్నాయి అంటే మనం స్వార్థంతో పనిచేస్తాము. మనకు భగవంతుడు పరమార్థం కాదు. మనకు స్వార్థమే పరమార్థం. మనం కోరికతో పనిచేస్తాము, స్వార్థాన్ని సంతృప్తి పరచుకోవటానికి పనిచేస్తాము, ఒకోసారి ఇష్టంతో, ఒకోసారి అయిష్టంతో పనిచేస్తాము. ఇష్టం ఉంటే ఉపకారం చేస్తాము, అయిష్టం ఉంటే అపకారం చేస్తాము. కాని ఇవి రెండూ మనలను బంధిస్తున్నాయి అనే సంగతి మన బుద్ధికి అందటం లేదు. బుద్ధిమంతుడు, వివేకవంతుడు, తపోబలం ఉన్నవాడు ఏమి చేస్తాడు అంటే ఇక్కడ శరీరాన్ని ఎలా విడిచిపెట్టి వెళ్ళిపోతాడో అలాగే వాడు చేసిన పాపాన్నే కాదు పుణ్యాన్ని కూడా ఈ లోకంలో విడిచిపెట్టి వెళ్ళిపోతాడు అని పరమాత్మ గీతలో చెప్పాడు. పని పనికోసమే చేసేవాడు బుద్ధిమంతుడు. అక్కడ అవసరం అనుకొంటే చేస్తాడు అంతేగాని కోరికతో ఏమీ చేయడు, ఆ పనిచేస్తే గౌరవం వస్తుందని అసలే చెయ్యడు. మనం కోరికవల్ల పనిచేస్తాము, దానివలన వాసనలు పడతాయి. కోరికతో చేసే ప్రతీకర్మ మనలను బంధిస్తుంది. భగవద్గీతకు వ్యాఖ్యానం రాస్తూ ఒక మహర్షి అద్భుతమైన రహస్యం చెప్పాడు. మంచివాడు చెడ్డవారితో స్నేహం చేస్తే ఏదైనా గొడవవస్తే మంచివాడిని ఆహుతిచేస్తారు, చెడ్డవారు తప్పకొంటారు. మంచివాడికంటే చెడ్డవాడికి కుయుక్తి ఎక్కువగా ఉంటుంది. చెడ్డవారు మంచివారితో స్నేహం చేస్తే చెడ్డవారు చనిపోరు, మంచివారిని చంపేస్తారు. వారు వెనకాల కుట్రపన్ని మంచివారిని తెరమీద నుంచోపెడతారు. అలాగే భారతయుద్ధంలో భీష్ముడు, ద్రోణాచార్యుడు ముందు ఆహుతి అయిపోయారు. మనం కోరికమీద కర్మ చేస్తాము. కర్మ చేసి ఫలం కోరుకొంటాము, ఆ ఫలం వస్తుంది, దానిని అనుభవించటానికి శరీరం ఉండాలి కదా. కోరిక వలన కర్మ, కర్మ వలన పునర్జన్మ, పునర్జన్మ వలన దుఃఖం. దేహం

వచ్చిన తరువాత వాడు ఎన్ని సంవత్సరాలు బతికినా, దుఃఖం అంటే ఎలా ఉంటుందో తెలియకుండా నేను బతికాను అని చెప్పినవాడు ఎవడూ లేడు. శరీరం వచ్చిందా ఆ మనిషికి దుఃఖం వచ్చి తీరుతుంది, ఏ రూపంలో వస్తుందో చెప్పలేము. శరీరం వస్తే లోకం వస్తుంది. లోకంలో ఏదో కర్మ చేస్తాడు. వాడికి వ్యక్తిభావన ఉంటుంది గాని సమిష్టిభావన వాడికి ఉండదు. వ్యక్తిభావనతో చేయటం వలన కర్మ వాడిని చుట్టుకొంటుంది. దేహాత్మబుద్ధి ఉన్నవాడు వాడు ఎంతటివాడైనా వాడికి ఎంతధనం ఉన్నా వాడిని దుఃఖం విడిచిపెట్టదు, ఇది చట్టం.

కృష్ణుడి విషయంలో అందరూ ఆక్షేపించేది ఏమిటి అంటే గోపికలు ఏదో వాడిని చుట్టేసుకున్నారు అని. ఆరవ సంవత్సరం పిల్లవాడికి కామం ఏమిటి? వాడు బృందావనం వచ్చేటప్పటికి ఆరవ సంవత్సరం పిల్లవాడు. వాడు గోపికలను చుట్టేసుకోవడం ఏమిటి? అది కాదు. రామావతారంలో ఉండగా ఏమి చేసేవాడు అంటే వాడు దైవాంశ సంభూతుడే అయినా మామూలు మనిషిలాగ ఉండేవాడు. నువ్వు దేవుడితో సమానం అని ఎవరైనా చెపితేనేగాని ఆయనకు తెలిసేదికాదు. ఆయన అరణ్యవాసం చేసేటప్పుడు అక్కడ ఉన్న మహర్షులను, యోగులను కలిసి వారికి నమస్కరించి నాలుగు మంచి మాటలు చెప్పండి అని వారిని అడిగేవాడు. కింద దుమ్ము అవి ఉంటే మనం పాదనమస్కారములు పెట్టము. రాముడు అలాకాదు అరణ్యంలో మహర్షులను కలిసినప్పుడు పాదనమస్కారాలు చేసేవాడు. అప్పుడు మహర్షులు రాముడిని దగ్గరకు తీసుకొని కౌగలించుకొనేవారు. ఆయన పరమాత్మ కదా అలా ఋషులు ఆయనను కౌగలించుకొన్నప్పుడు పరమానందం పొందేవారు. ఈ ఆనందాన్ని ఎప్పుడూ ప్రసాదించమని ఋషులు అడిగారు.ఈ జన్మలో సాధ్యంకాదు, నేను పని మీద వెళుతున్నాను, ఒకరోజు మీ ఆశ్రమంలో ఉంటాను, ఎప్పుడూ ఇక్కడ ఉండలేను అంటాడు. తరువాత ఈ మహర్షులే గోపికలుగా వచ్చి కృష్ణుడిని కౌగిలించుకొని వారు ఆనందాన్ని అనుభవించారు. అప్పటికి ఆయన వయస్సు ఆరు సంవత్సరాలు. ఏదో మానవులు ప్రకృతిబుద్ధితో కౌగిలించుకొనే కౌగిలింతలు కాదు అవి. నీవు, నేను అనే బేధబుద్ధి లేకుండా కౌగిలించుకొంటే కొబ్బరిచెట్టును కౌగిలించుకొంటే ఎంతో స్త్రీని కౌగిలించుకొన్నా అంతే. ప్రకృతిబుద్ధి ఉన్న మీకా ఇది అర్థమయ్యేది. భేదబుద్ధి ఉంటే కదా అక్కడ కామం ఉదయించటానికి. కృష్ణుడు అతీంద్రియుడు అంటే ఇంద్రియాలు ఉన్నా లేనివాడితో సమానము. నీవు, నేను అనే భేదబుద్ధి లేనివాడిని స్త్రీలు కౌగిలించుకొన్నా వాడికి ఏమీ వికారం రాదు. ప్రకృతిని దాటి వెళితేనే గాని ఈ వైభవం మనకు తెలియదు. పూర్వం

యుగాలమాట వదిలెయ్యండి, ఎక్కడో రాముడు కృష్ణుడు మాట వదిలెయ్యండి, శ్రీకృష్ణచైతన్య ఎంత జితేంద్రియుడు అంటే వాడి నాలుకమీద పంచదారవేస్తే మరల ఆ పంచదార అంతా మనం వెనక్కి లాగేస్తే అందులో ఒక్క పలుకు కూడా తడవదు, వాడు శ్రీకృష్ణచైతన్య. మనకు ఎక్కడైనా జిన్ను కనిపిస్తే, స్వీటు కనిపిస్తే నోరంతా లాలాజలం. ఇటువంటి మనం వారి మీద తీర్పులు చెప్పటం. ఇంద్రుడికి గర్వభంగం చేయటం కోసం ఆయన చిటికినవేలితో కొండను వారం రోజులు ఎత్తి ఉంచాడు పరమాత్మ. అప్పటికి ఆయనకు అయిదు సంవత్సరాలు. ఒక మనిషికి గర్వం పెరుగుతోంది అనుకోండి, భగవంతుడు ఏదో రూపంలో వాడికి గర్వభంగం చేసేస్తాడు. అది ఏ రూపంలో చేస్తాడు, ఎలా చేస్తాడు, ఎక్కడ చేస్తాడు అనేది మనం చెప్పలేము. గర్వభంగం ఎందుకు చేస్తాడు అంటే వాడిమీద కోపం వలన కాదు, వాడికి వినయం నేర్పటంకోసం, వాడు బాగుపడటంకోసం అలా చేస్తాడు. ఎదుటివారు సుఖపడాలని నీ జీవితంలో ఒక్క పని అయినా చేసావా? పని పనికోసమే నువ్వు చేస్తున్నావా?

రాధ గోపికల్లో ఒక గోపిక, కృష్ణుడు బృందావనాన్ని విడిచిపెట్టివెళ్ళేటప్పుడు నువ్వు మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నావు, నీ పిల్లనగ్రోవిని నాకిచ్చేయి అంటుంది రాధ. అప్పుడు కృష్ణుడు పిల్లనగ్రోవిని రాధకు ఇచ్చి వెళ్ళిపోతాడు. కృష్ణుడులేని వియోగాన్ని తట్టుకోవటానికి రాధ ఏమిచేసేది అంటే పిల్లనగ్రోవి ద్వారా కృష్ణుడి యొక్క సంగీతాన్ని మిగతా గోపికలకు వినిపించేది. ఉత్తర ప్రదేశ్‌లో కృష్ణుడికి ఎంత గౌరవం ఇస్తారో, రాధకు అంతే గౌరవం ఇస్తారు. కారణం ఏమిటి అంటే రాధ చూస్తే కృష్ణుడినే చూస్తూ, కృష్ణుడినే స్మరిస్తూ, కృష్ణుడి మాటలే వింటూ అలా జీవించటం వలన కృష్ణుడే రాధ, రాధే కృష్ణుడు అనే స్థాయికి వచ్చేసింది. కృష్ణుడి పట్ల ఉన్న సజీవమైన ప్రేమకు రాధ గుర్తు. భగవంతుడి పట్ల మనకు ఉన్న ప్రేమను, అనుబంధాన్ని, ఇష్టాన్ని భక్తి అంటారు. మీకంటే ఉన్నతస్థాయిలో ఉన్నవాడిమీద మీకు ప్రేమ ఉంటే దానిని భక్తి అంటారు, మీకంటే తక్కువ స్థాయిలో ఉన్న జీవకోటి మీద మీరు ప్రేమ చూపిస్తూ ఉంటే దానిని దయ అంటారు. మనం ఇంకొకటి నేర్చుకోవాలి. మన శక్తికిమించిన పనులు చేయకూడదు. మనకు ఎంతైతే యోగ్యత ఉందో, ఎంతైతే అర్హత ఉందో అంతవరకే పనులు చేయాలి. మనకంటే శక్తిమంతులతోటి వైరం పనికిరాదు. టైము వచ్చేవరకు వేచి ఉండాలి, కాని కంగారుపడి వారితో కలబడకూడదు. భీష్ముడు ధర్మరాజుకు నీతులు చెప్పేటప్పుడు ఒక చెట్టు గురించి చెప్పాడు. ఆ చెట్టు మంచిదే, మంచి ఫలాలు ఇస్తుంది, మంచి ఆకులతో ఉంటుంది అందుచేత అందరూ ఆ చెట్టును పొగిడేవారు, అలా పొగడటం వలన దానికి గర్వం వచ్చింది. దానికి గర్వభంగం చేయటంకోసం నారదుడు వచ్చాడు. నారదుడు ఆ చెట్టు దగ్గరకు వచ్చి నీవు

చాలాబలంగా ఉన్నావు, మంచికాయలు కాస్తున్నావు, మంచి ఆకులు ఉన్నాయి అని అంటూ బహుశా వాయుదేవుడు కూడా నిన్నేమీ చేయలేడు అంటాడు. గాలివాన నన్నేమి చేస్తుంది, వాయుదేవుడు నన్నేమిచేస్తాడు అంటుంది చెట్టు. నారదుడు వాయుదేవుడి దగ్గరకు వెళ్ళి ఫలానా చెట్టు నిన్ను కూడా లెక్కచేయను అంటోంది అని చెపుతాడు. వాయుదేవుడికి కోపం వచ్చింది, నన్ను లెక్కచేయవా అయితే రేపు వస్తాను నీ పని చూస్తాను అంటాడు. అప్పడు ఆచెట్టుకు భయం వేసింది. శుభ్రంగా బతుకుతున్నాను, నా ఆకులు అన్నీ రాలగొట్టేస్తాడేమో, నా ప్రాణం కూడా తీస్తాడేమో అని మరుసటిరోజు ఆయన వచ్చేటప్పటికి ఆకులు దులుపేసుకొని, పళ్ళన్నీ పడగొట్టేసుకొని మోడులా అయిపోయింది. ఏమిటి ఇలా మోడులా అయిపోయావు అంటే నువ్వు రాకుండానే నాకు గర్వభంగం అయిపోయింది. నువ్వు వస్తే నా ప్రాణం తోడేస్తావేమోనని నేను ముందుగానే మోడయి ఉన్నాను. నువ్వు వెళ్ళిపోయిన తరువాత మరల ఆకులు తొడుగుతానులే అంది. అంటే దాని అర్థం ఏమిటి అంటే నీకంటే ఎక్కువ శక్తిమంతులతో కంగారుపడి నువ్వు విరోధం పెట్టుకోవద్దు అని చెప్పటం. ఒకవేళ వాడు నిజంగా దుర్మార్గుడు అనుకో. నువ్వు కొంతటైము తీసుకో, వాడిని అణిచివేసే టైము వచ్చేవరకు నువ్వు వెయిట్ చెయ్యి, ఒకమాట మీరు గుండెలో దాచుకోండి. మనకు ఆకలివేస్తోంది అనుకోండి అన్నం తింటే ఆకలి తగ్గిపోతుంది, మీకు ఎవరినైనా చూడాలని ఉంది అనుకోండి, వెళ్ళి చూసి వస్తే చూసాము అనే సంతృప్తి ఉంటుంది. మీకు సీతాఫలాలు తినాలని ఉంది అనుకోండి. నాలుగుపళ్ళు తినేసిన తరువాత ఇంక మనస్సు వాటి మీదకు వెళ్ళదు కాని భయం ఇలా తగ్గదు, ఇది జ్ఞాపకం పెట్టుకోండి. ఆత్మజ్ఞానం కలిగేవరకూ, భేదబుద్ధి నశించే వరకు ఎవడినీ భయం విడిచిపెట్టదు. అధికారం ఉన్నవాడికి అధికారం పోతుందేమోనని భయం, ధనవంతుడికి ధనం పోతుందేమోనని భయం, ఆరోగ్యవంతుడికి అనారోగ్యం వస్తుందేమోనని భయం, పాముని చూస్తే భయం, దుర్మార్గుడిని చూస్తే భయం. స్వరూపజ్ఞానం కలిగేవరకూ, ఏ వస్తువులో అయితే భయం లేదో ఆ వస్తువు తాలుక అనుభవం కలిగేవరకూ ఏ జీవుడిని భయం విడిచిపెట్టదు. కోరికను విడిచిపెట్టు, కోపాన్ని విడిచిపెట్టు, భయాన్ని విడిచిపెట్టు ఎందుచేతనంటే ఇవి అన్నీ దుఃఖాన్ని తీసుకొని వస్తాయి అందుచేత వీటిని తగ్గించుకో అని పరమాత్మ చెపుతున్నాడు. భగవంతుడి పట్ల మనకు ఉన్న భక్తి నిజమైతే మనకు ఉన్న దేహాత్మబుద్ధి నశించేవరకు భక్తి మనలను తీసుకొని పోతుంది, మనలో ఉన్న దోషాలు, బలహీనతలు మనకు తెలియకుండానే రాలిపోతాయి. భగవంతుడిపట్ల విశ్వాసం పెరిగేకొలది, ఆయనను సమీపించేకొలది మనలో ఉన్న అజ్ఞానం నశిస్తుంది. నువ్వు ఎవరిపట్ల వైరం పెట్టుకోవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు.

నువ్వు ఎవరిపట్ల అయినా వైరం పెట్టుకొంటే నీకు రోజూ వారే జ్ఞాపకం వస్తారు, పరమాత్మ జ్ఞాపకం రాడు.

ఈశ్వరుడిపట్ల ఎంత భక్తిగా ఉన్నావో, నీ చేతిలో ఉన్న పనిపట్ల కూడా అంతే భక్తిగా ఉండు. పని దొంగలుగా ఉండవద్దు. భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేయి. మీకు ఏదైనా అవకాశం ఉంటే సమాజానికి ఉపయోగపడే పని కొంత చేయండి. సమాజరూపంలో ఉన్నవాడు కూడా పరమేశ్వరుడే. ఈశ్వరునిదయ సంపాదించటానికి పని చేయండి. అంతేగాని గొప్పలకోసం, గౌరవాలకోసం పనులు చేయవద్దు. ఇలా పనిచేస్తూ ఉంటే నీవు దండలు వేయనక్కరలేదు, గుంజీలు తీయనక్కరలేదు, నీచేత నేను ఆరాధించబడుతున్నాను అని పరమాత్మ చెపుతున్నాడు. నువ్వు ఏమనుకొంటున్నావు అంటే నా బొమ్మ దగ్గర నాలుగు పుష్పాలు పెడితేనే ఆరాధిస్తున్నాను అనుకొంటున్నావు. నువ్వు నిష్కామకర్మ చేసినా ఆ కర్మచేత కూడా భగవంతుడు ఆరాధింపబడతాడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారికి ఏదైనా కలిసివస్తే పొంగిపోతారు, కలిసిరాలేదు అనుకోండి ఏడుస్తూ కూర్చొంటారు. ఈ రెండూ భక్తుడికి పనికిరావు అంటున్నాడు. నీకు ఏదైనా కలిసివచ్చినా, అది కలిసిరాకముందు ఎలా ఉన్నావో తరువాత కూడా అంత నిర్వికారంగా ఉండాలి. నీకు పది వంకాయలు ఉన్నాయి అనుకో రెండు వంకాయలు ఇతరులతో షేర్ చేసుకో. పెద్ద ధర్మాలు, దానాలు అక్కరలేదు. నీకు ఉన్న సంపదను కొంత ఇతరులతో షేర్ చేసుకో. మనం వంకాయలు ఇతరులకు ఇచ్చినా పది వంకాయలలో ఏరి ఏరి పనికిరానివి ఇతరులకు ఇస్తాము. ఈ పాడైపోయిన వంకాయలు అక్కడ పరమాత్మ తింటున్నాడు అని మనకు తెలియటం లేదు. ఎక్కడో మోక్షందాక వెళ్లద్దు. నీకున్న దానిని ఇతరులతో షేరింగ్ వలన భగవంతుని అనుగ్రహం కలుగుతుంది, జీవించి ఉండగానే పరమానందాన్ని పొందుతావు. మనం చేయవలసింది ఏమిటి అంటే ఈ లోకానికి పరలోకానికి సమన్వయం సంపాదించుకోవాలి. ఈ లోకంలో మన పని మనం శ్రద్ధగా చేస్తూ, ట్రెనింగ్ పొందుతూ ఉత్తమలోకాన్ని పొందాలి అంతేగాని అస్తమానూ పరలోకం గురించి ఆలోచిస్తూ ఈ లోకంలో సోమరితనానికి అలవాటు పడితే చివరికి అదీ రాదు, ఇదీ రాదు, ఉభయ భ్రష్టత్వంపడుతుంది. ఎక్కడో ఏదో ఉంది అని ఊహించుకోవద్దు, వాస్తవపరిస్థితులను విడిచిపెట్టవద్దు. వాస్తవ పరిస్థితులను అంగీకరిస్తూ ఇందులో పొందవలసిన ట్రెనింగ్ పొందుతూ జ్ఞానం సంపాదించి, పరమార్థాన్ని పొందు. అయితే జ్ఞానం కూడా భక్తి మిశ్రితమై ఉండాలి.

మీరు ఏదైనా కర్మ చేస్తూ ఉంటే జ్ఞానం ఉండాలి, భక్తి ఉండాలి. మీరు ఏదైనా పనిచేస్తూ ఉంటే ఆ పని ఎలా చెయ్యాలో తెలిసి ఉండాలి, అది జ్ఞానం. చేసేపని విశ్వాసంగా చెయ్యాలి, అది భక్తి. ఇన్ని రకాలుగా సమకూడితేనే మీ పనికి సౌందర్యం వస్తుంది, మీకు ఆనందం వస్తుంది, ఆ పని కలకాలం నిలబడుతుంది. మీరు చేసే పని ద్వారా భగవంతుడి అనుగ్రహం సంపాదించాలి. భగవంతుడి అనుగ్రహం సంపాదిస్తే మనకు ఎప్పుడు ఏది ఎలా ప్రసాదించాలో ఆయనే ప్రసాదిస్తాడు. ఒక మనిషి మీద మీకు గౌరవం ఉండవచ్చు. అలాగని ఇంకో మనిషిని అగౌరవపరచకూడదు. మనకు ఏదో గురువు అంటే ఇష్టం అనుకోండి, ఆ గురువు ముందు కృష్ణుడు తక్కువ, రాముడు తక్కువ అనుకొంటాము, అదో పాడుబుద్ధి. అవతారపురుషులను మనం అగౌరవపరచకూడదు. భగవంతుడు మనకు ఎంతకాలం అయితే ఆయుర్ధాయం ఇచ్చాడో అంతవరకూ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీకు ఉన్న డబ్బుకంటే, చదువుకంటే, అధికారంకంటే ఆయుర్ధాయం గొప్పది. ఎందుకు ఆయుర్దాయం గొప్పది అనుకొంటున్నాను అంటే మీకు అంగబలం, అర్థబలం అన్నీ ఉన్నాయి అనుకో 20 సం॥లు వచ్చేసరికి చనిపోయారు అనుకో. ఇవి అన్నీ మీకు దేనికి ఉపయోగపడవు. ముక్కులో గాలి బయటకుపోయాక మీకు ఎన్ని ఉన్నా ప్రయోజనం లేదు, అందుచేత వీటికంటే ఆయుర్ధాయం గొప్పది. అందుచేత భగవంతుడు ఎంతవరకు మనకు ఆయుర్ధాయం ఇచ్చాడో అంతవరకు భగవంతుడి నామాన్ని జపించుకొంటూ, ఆయన గుణాలను కీర్తించుకొంటూ, మనం చేసేపని ప్రేమగా ప్రీతిగా చేస్తూ చివరి శ్వాస వరకు ఇలా జీవితాన్ని గడపాలిగాని ప్రాణం ఎప్పుడుపోతుందా అని కనిపెట్టుకొని ఉండకూడదు. బుద్ధిమంతుడు అయినవాడు చనిపోయినవారి గురించి దుఃఖపడడు, బతికి ఉన్నవారి గురించి వీరు ఎప్పుడు చనిపోతారు అని కనిపెట్టుకొని ఉండడు. ఎవరో చనిపోతే మీకు 10 ఎకరాలు కలిసివస్తాయి అని, ఆ పది ఎకరాల కోసం వాడి ప్రాణాలు పోవాలని అనుకోకూడదు, అలా ఉంటే చనిపోయాక మీకు పాడులోకాలు వస్తాయి. అందుచేత మనకు వచ్చే ప్రతీ తలంపులోనూ జాగ్రత్తగా ఉండాలి. నీ గురించి నీవు ఆలోచించుకోవటం మానివేసి, నిరంతరం నన్ను స్మరిస్తూ ఉంటే, నన్ను ధ్యానిస్తూ ఉంటే నీ యోగక్షేమాలు చూసే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ. పైన ఆకాశం ఉంది, కింద భూమి ఉంది. ఈ భూమి, ఆకాశం కలిసిపోయి ఐక్యం అయినట్లు మనకు కనిపిస్తూ ఉంటే ఎంత గొప్ప దృశ్యం ఇది, ఎంత వండర్‌ఫుల్‌గా ఉంది అనుకొంటాము. రాధాకృష్ణుల కౌగిలి అంత వండర్‌ఫుల్‌గా ఉంటుంది. అక్కడ దేహవాసన లేదు, అది లౌకికం కాదు, అలౌకికం. ఆ దేహం తాను కాదని రాధకు తెలుసు, ఆ దేహంతాను కాదని కృష్ణుడికి తెలుసు. ఉన్నది ఒక్కటే వస్తువు. అందుచేత ఆనందం

ఆనందాన్ని కౌగిలించుకొంటోంది, శాంతి శాంతిని కౌగిలించుకొంటోంది. అది మనకు అర్థంకాక పెడఅర్థాలు తీస్తున్నాము. వారిది డివైన్ లవ్, రోజులు క్షణాలకింద వెళ్ళిపోయేవి. కృష్ణలీలలు ప్రాకృతికబుద్ధి ఉన్నవాడికి అర్థంకావు. కృష్ణుడు అక్కడ అలా చేసాడు, ఇక్కడ ఇలా చేసాడు అనుకొంటాముకదా, అసలు ప్రకృతికి సంబంధించిన వాసనగానీ, పాపంగానీ, దోషంగాని పరమాత్మలో లేవు, ఉన్నట్లు మన బుద్ధికి అనిపిస్తుంది దానికి కారణం మనకు భక్తి లేదు, ప్రేమ లేదు, వివేకం లేదు, క్రమశిక్షణ లేదు. మనం జీవితాన్ని జాగ్రత్తగా నియమించుకొంటే, మనది క్రమశిక్షణతో కూడిన జీవితం అయితే ఈశ్వరసాక్షాత్కారం దానంతట అదే కలుగుతుంది.

మనకు భాగవతంలో రెండు కథలు ముఖ్యం. 1. ధృవుడు, 2. ప్రహ్లాదుడు. భక్తులందరిలోకి అగ్రస్థానం ప్రహ్లాదుడికి ఇచ్చారు. ధృవుడికి నారదుడు వాసుదేవ మంత్రం ఉపదేశించాడు. వాసుదేవ మంత్రం స్మరించుకొంటూ నిద్ర లేదు, ఆహారం లేదు అలా ఉండిపోయాడు ధృవుడు. అప్పడు మహావిష్ణువు వచ్చి దర్శనమిస్తాడు, ధృవుడు ఆయన వంక చూడడు. ఎవరిని తెలుసుకోవటం కోసం నీవు ధ్యానం చేస్తున్నావో వాడిని నేనేనయ్యా అంటాడు మహావిష్ణువు. అప్పడు ధృవుడు కళ్ళు తెరుస్తాడు. భౌతికమైన నేత్రాలతో పరమాత్మను దర్శించాడు. మహాత్ములకు, మహర్షులకు లేనటువంటి వైభవం అది. అప్పటికి కోరికలు లేని స్థితికి వచ్చేస్తాడు ధృవుడు. ఏదైనా కోరుకో నాయనా అంటే, నాకు ఒక్కటే కోరిక ఉంది ఎప్పడూ నీ పాదాలయందు భక్తి నిలబడి ఉండేలా చూడు, అంతకంటే ఇంకొక కోరిక ఏమి లేదు అంటాడు. కొంతమంది భక్తులు ముక్తికంటే భక్తికి అగ్రస్థానం ఇస్తారు. వాళ్ళకు ఎంజాయ్ చేయటానికి బాహ్యమైన వస్తుజాలం అక్కరలేదు, వారిని వారే ఎంజాయ్ చేస్తూ ఉంటారు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడితో అంటాడు నారాయణ, నారాయణ అంటావు ఏమిటి, ఎవరిని చూసుకొని ఈ పొగరుబోతు మాటలు మాట్లాడుతున్నావు అంటే నీకు ఆధారం, నాకు ఆధారం, మొత్తం సృష్టికి ఆధారమైన నారాయణుడి సపోర్టు చూసుకొనే మాట్లాడుతున్నాను అంటాడు ప్రహ్లాదుడు. నేను చెప్పిన నారాయణుడు ఇందుగలడు, అందులేడు అనికాదు, అంతటా ఉన్నాడు అని చెపుతాడు. అంతటా ఉంటే ఈ స్థంబంలో కూడా ఉన్నాడా అని హిరణ్యకశిపుడు అడుగుతాడు. అంతటా ఉన్నవాడు ఈ స్థంబంలో లేకుండా ఎలా ఉంటాడు అన్నాడు ప్రహ్లాదుడు. అప్పడు హిరణ్యకశిపుడు గదతో ఆ స్థంబాన్ని మోదుతాడు, ఆ స్థంబంలో నుండి భయంకరమైన శబ్ధంతో నరసింహస్వామి అవతారం వచ్చింది. ఒక్క ప్రహ్లాదుడిని రక్షించటానికే స్వామి ఆ అవతారంలో వచ్చాడు.